బిల్కిస్ దోషులు మళ్లీ జైలుకే!

11 మంది దోషుల విడుదల చెల్లదు

రెండు వారాల్లో వారిని తిరిగి జైలుకు పంపాలి

బిల్కిస్ బానో పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పు

గుజరాత్ ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేసిందని వ్యాఖ్య

జైలు నుంచి విడుదలైన బిల్కిస్ బానో కేసు దోషులకు సన్మానం (ఫైల్)

న్యూఢిల్లీ, జనవరి 8: బిల్కిస్ బానో కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. ఈ కేసులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న 11 మంది దోషులను గుజరాత్ ప్రభుత్వం ముందస్తుగా విడుదల చేయడాన్ని సోమవారం రద్దు చేసింది. బీజేపీ నేతృత్వంలోని గుజరాత్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడి హత్యలు, లైంగికదాడికి పాల్పడిన దోషులకు శిక్ష నుంచి ఉపశమనం కలిగించడాన్ని సర్వోన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. గోద్రా అల్లర్ల సందర్భంగా 2002లో బిల్కిస్ బానోకు చెందిన ఏడుగురు కుటుంబ సభ్యులను హత మార్చడమే కాకుండా ఐదు నెలల గర్భిణీ అయిన ఆమెపై సామూహిక లైంగికదాడికి పాల్పడిన 11 మందిని రెండు వారాల్లో తిరిగి జైలుకు పంపాలని ఆదేశించింది. గుజరాత్ ప్రభుత్వం మతి లేకుండా దోషుల విడుదలకు రెమిషన్ (శిక్షా కాలం తగ్గింపు) ఉత్తర్వులు జారీ చేసిందని న్యాయమూర్తులు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. బాధిత మహిళ ఏ జాతికి చెందినదైనా లేక ఏ మతానికి చెందినదైనా ఆమెపై అత్యంత నీచమైన నేరానికి పాల్పడిన వారికి శిక్షా కాలాన్ని తగ్గించవచ్చా? అని ప్రశ్నించింది. గోద్రా రైలు దుర్ఘటన అనంతరం చెలరేగిన అల్లర్ల సందర్భంగా దుండగుల నుంచి తప్పించుకొని పారిపోతున్న బిల్కిస్ బానోను దుండగులు నిర్బంధించి ఆమెపై సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. ఆ అల్లర్లలో మరణించిన ఏడుగురు కుటుంబ సభ్యులలో మూడేండ్ల బిల్కిస్ బానో కుమార్తె కూడా ఉన్నది. తనపై లైంగికదాడి జరిగినప్పుడు ఆమె ఐదు నెలల గర్భవతి. ఈ కేసులో దోషులైన 11 మందిని గుజరాత్ ప్రభుత్వం 2022, ఆగస్టు 15న స్వాతంత్ర్యం దినోత్సవం సందర్భంగా విడుదల చేసింది.

లేని అధికారాలను ఉపయోగించిన గుజరాత్ సర్కారు

అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ గుజరాత్ ప్రభుత్వం దోషులకు అనుకూలంగా జారీచేసిన రెమిషన్ ఉత్తర్వులను రద్దు చేస్తున్నామని ధర్మాసనం ప్రకటించింది. దోషుల శిక్షా కాలాన్ని తగ్గించే అధికారం గుజరాత్ ప్రభుత్వానికి లేదని తమ 100 పేజీల ఉత్తర్వులలో స్పష్టంచేసింది. ఏ రాష్ట్రంలోనైతే నేరస్థలపై విచారణ జరిగిందో, ఎక్కడైతే వారికి శిక్ష పడిందో ఆ ప్రభుత్వమే వారి శిక్షా కాలాన్ని తగ్గించే విషయమై నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది. బిల్కిస్ బానో కేసును మహారాష్ట్రలో విచారణ జరిపారు. దోషుల శిక్షా కాలాన్ని తగ్గించే అధికారం మహారాష్ట్రకు తప్ప గుజరాత్‌కు లేదని స్పష్టం చేసింది. చట్టాన్ని అతిక్రమిస్తూ గుజరాత్ ప్రభుత్వం తనకు లేని అధికారాలను ఉపయోగించి.. దుర్వినియోగం చేసిందని వ్యాఖ్యానించింది. అందువల్ల కూడా ఆ ప్రభుత్వం జారీచేసిన రెమిషన్ ఉత్తర్వులను రద్దు చేస్తున్నామని పేర్కొంది. సాక్ష్యాధారాలను తారుమారు చేస్తున్నారని, సాక్షులను బెదిరిస్తున్నారని బిల్కిస్‌బానో ఆందోళన వ్యక్తంచేయడంతో గుజరాత్ హైకోర్టు అప్పట్లో ఆమె కేసును అహ్మదాబాద్ నుంచి ముంబైకి బదిలీ చేసింది.

మే 13, 2022 ఉత్తర్వులు కూడా రద్దు

దోషులలో ఒకడు తన శిక్షా కాలాన్ని తగ్గించాలని కోరుతూ చేసిన విజ్ఞప్తిని పరిశీలించాలని సుప్రీంకోర్టు మరో ధర్మాసనం 2022, మే 13న ఇచ్చిన ఆదేశాలను కూడా రద్దు చేస్తున్నట్టు న్యాయస్థానం ప్రకటించింది. ఆ దోషి వాస్తవాలను కప్పిపుచ్చి మోసపూరితంగా కోర్టు నుంచి ఆ ఆదేశాలను పొందాడని పేర్కొంది. చట్టాన్ని ఉల్లంఘించేందుకు కోర్టు ఉత్తర్వులను వాడుకున్న ఓ ప్రత్యేకమైన కేసు ఇది అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. మే 13న ఇచ్చిన ఉత్తర్వులను సమీక్షించాలని గుజరాత్ ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయక పోవడంపై తీవ్రస్థాయిలో మండిపడింది. ఆ ఉత్తర్వులను అవకాశంగా తీసుకొని ఇతర దోషులు కూడా తమ శిక్షా కాలాన్ని తగ్గించాలని కోరుతూ దరఖాస్తులు చేసుకున్నారని.. గుజరాత్ ప్రభుత్వం వారికి అనుకూలంగా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నదని తెలిపింది. వాస్తవాలను కప్పిపుచ్చి ఆ దోషి కోర్టు నుంచి ఉత్తర్వులు పొందాడని పేర్కొంది. 'జరిగిన తప్పును సరిదిద్దేందుకు ప్రతీకారంగా శిక్ష విధించరు కానీ, ఇక ముందు అటువంటి నేరాలు జరుగకుండా నివారించడం, సంస్కరించడం కోసం శిక్షలు వేస్తారు' అంటూ జస్టిస్ నాగరత్న గ్రీకు తత్వవేత్త ప్లేటోను ఉటంకించారు. 'దోషులు తాము చేసిన నేరానికి శిక్ష నుంచి తప్పించుకుంటే.. సమాజంలో శాంతి, సామరస్యాలు అగాధంలో పడిపోతాయి. ఏకపక్షంగా జారీ అయిన ఆదేశాలను సాధ్యమైనంత త్వరగా సరిదిద్ది, ప్రజల్లో విశ్వాసాన్ని నిలబెట్టే బాధ్యత కోర్టులదే'నని అన్నారు.

దోషుల విడుదలను సవాలు చేస్తూ బిల్కిస్ బానోతోపాటు సీపీఎం నాయకురాలు సుభాషిణి అలీ, జర్నలిస్ట్ రేవతి లౌల్ తదితరులు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై సుప్రీంకోర్టు 11 రోజులపాటు ఏకధాటిగా విచారణ చేసి గత ఏడాది అక్టోబర్ 12న తీర్పును రిజర్వులో ఉంచింది. దోషుల శిక్షా కాలాన్ని తగ్గించడానికి సంబంధించిన పత్రాలను తమకు అక్టోబర్ 16లోగా అందజేయాలని అదే రోజున కేంద్ర, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.

ఏడాదిన్నర కాలంలో తొలిసారి నవ్వా..

సుప్రీంకోర్టు తీర్పుతో కలిగిన ఉపశమనంతో కన్నీళ్లు వచ్చాయి. గత ఏడాదిన్నర కాలంలో తొలిసారి నవ్వా. ఈ రోజే నాకు నిజమైన కొత్త ఏడాది. తీర్పుతో గుండెలపై ఉన్న కొండ అంత పెద్ద రాయిని దింపేసినట్లయింది.. న్యాయం అంటే ఇదే అనిపిస్తున్నది. సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు. అందరికీ సమన్యాయం దక్కుతుందనే ఆకాంక్ష, నిరూపణకు తాజా తీర్పు నిదర్శనం. దేశంలోని ప్రతి స్త్రీకి న్యాయం చేయాలనే ఆలోచనను రక్షించేందుకు మీరు పోరాడాలనే సంకల్పాన్ని ఇచ్చారు.

- సుప్రీంకోర్టు తీర్పుపై బిల్కిస్ బానో

సుప్రీంకోర్టు తీర్పు బలమైన సందేశం

ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): బిల్కిస్ బానో కేసు దోషుల ముందస్తు విడుదలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్వాగతించారు. ఈ మేరకు సోమవారం కవిత "ఎక్స్" లో స్పందించారు. మహిళల పట్ల నిబద్ధత విషయంలో సుప్రీంకోర్టు తీర్పు బలమైన సందేశాన్ని ఇస్తున్నదని ఆమె తెలిపారు. ఇలాంటి ప్రతి తీర్పు మహిళలకు అండగా నిలుస్తుందనడానికి ఉదాహరణ అని అభిప్రాయపడ్డారు. న్యాయం గెలిచిందని స్పష్టం చేశారు. కాగా, బిల్కిస్ బానో దోషులను ముందస్తుగా విడుదల చేస్తూ గుజరాత్ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు సరికాదని, వాటిని రద్దు చేయాలని కోరుతూ గత ఏడాది మేలో అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణకు కవిత లేఖ రాసిన సంగతి తెలిసిందే.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షమాపణలు చెప్పాలి

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో కేంద్రం, గుజరాత్ బీజేపీ ప్రభుత్వాలు బిల్కిస్ బానోకు క్షమాపణలు చెప్పాలి. బిల్కిస్ బానో కేసు దోషుల విడుదలకు ఇటు గుజరాత్, అటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాలు సహకరించాయి. ఈ తీర్పు భవిష్యత్తులో ఎవరైనా లైంగిక దాడులకు పాల్పడితే.. ఏ విధంగానే తప్పించుకొనేందుకు వీలుండదని చెప్పేందుకు ఇది ఉదాహరణగా పనిచేస్తుందని భావిస్తున్నాను. ప్రధాని మోదీ చెప్పే 'నారీ శక్తి' మాటలు ఒట్టి బూటకం క్షేత్రస్థాయిలో అది కనిపించదు.

-అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం చీఫ్

బిల్కిస్ బంధువుల సంబురాలు

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో గుజరాత్‌లోని దాహోద్ జిల్లా దేవగఢ్ బరియా పట్టణంలో బిల్కిస్ బానో బంధువులు సంబురాలు చేసుకొన్నారు. టీవీల్లో తీర్పు వార్త రాగానే వారంతా టపాసులు పేలుస్తూ ఆనందం వ్యక్తం చేశారు.

విద్యుత్తు వెలుగుల్లో అయోధ్య రామాలయం

రామమందిర ప్రారంభోత్సవం..
టైమ్‌స్క్వేర్‌లో ప్రత్యక్ష ప్రసారం

అయోధ్య, జనవరి 8: అయోధ్యలో ఈ నెల 22న అంగరంగవైభవంగా జరుగనున్న రామ మందిర ప్రారంభోత్సవం న్యూయార్క్‌లో ఉన్న ప్రఖ్యాత టైమ్స్ స్క్వేర్ వద్ద ప్రత్యక్ష ప్రసారం(లైవ్ స్ట్రీమింగ్) కానున్నట్టు మీడియా కథనాలు పేర్కొన్నాయి. దేశంతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులు ఎదురుచూస్తున్న రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని వివిధ భారత రాయబార కార్యాలయాలు, కాన్సులేట్లలో కూడా ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని నివేదించాయి.

రామమందిర్ థీమ్ చీరలకు గిరాకీ

అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం నేపథ్యంలో రామ మందిర్ థీమ్‌తో నేసిన బనారస్ చీరలకు మస్తు గిరాకీ ఏర్పడింది. దేశ, విదేశాల నుంచి పెద్దయెత్తున ఆర్డర్లు వస్తున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. తాము తయారు చేస్తున్న రామ మందిరం థీమ్ చీరలు ఫ్యాషన్ ట్రెండ్ సృష్టించబోతున్నాయని యూపీలోని ముబారక్‌పూర్‌కు చెందిన అనిసూర్ రెహ్మాన్ అనే వ్యాపారి పేర్కొన్నారు. రామ్ దర్బార్ వర్ణన ఉన్న చీరలకు చాలా డిమాండ్ ఉన్నదని పీలీ కోఠి ప్రాంతానికి చెందిన మరొకరు తెలిపారు. క్వాలిటీ, డిజైన్‌ను బట్టి ఒక్కో చీర ధర రూ.7 వేల నుంచి లక్ష వరకు ఉండే అవకాశం ఉన్నదని వ్యాపారులంటున్నారు.

ప్రాణ ప్రతిష్ఠకు స్వయంగా ఆహ్వానం

వందలాది ప్రతినిధులు, స్వచ్ఛంద సేవకుల సాయంతో అయోధ్య రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ ఆహ్వానాలను అతిథులందరికీ స్వయంగా అందిస్తున్నట్టు అయోధ్య రామాలయ ట్రస్ట్ అధికార వర్గాలు తెలిపాయి. ఆలయ ట్రస్ట్‌తో పాటు ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. విదేశాల్లోని అతిథులకు సైతం స్వయంగా ఆహ్వానాలను అందిస్తున్నారు.

ఇష్టానుసారం వ్యవహరించే ప్రభుత్వాలకు ఇదో గుణపాఠం

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): ఎన్నికైన ప్రభుత్వాలు తమ రాజకీయ అవసరాల కోసం ఇష్టానుసారంగా వ్యవహరించకూడదని బిల్కిస్ బానో వ్యవహారంతో మరోసారి రుజువైందని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన్ ఎక్స్ ద్వారా స్పందించారు. 'బిల్కిస్ బానోకు న్యాయం చేసిన సుప్రీంకోర్టుకు, ప్రముఖ న్యాయవాదులకు ధన్యవాదాలు. ఈ విషయంలో గుజరాత్ ప్రభుత్వంపై, అలాగే అధికార దుర్వినియోగానికి పాల్పడిన వారిపై గట్టి చర్యలు ఉంటాయని ఆశిస్తున్నాను. ఎన్నికైన ప్రభుత్వాలు తమ రాజకీయ అవసరాల కోసం ఇష్టానుసారంగా వ్యవహరించరాదని ఈ వ్యవహారం స్పష్టం చేస్తున్నది. దీన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి' అని కేటీఆర్ పేర్కొన్నారు.

ప్రపంచంలోనే తొలి వైర్‌లెస్, ట్రాన్సపరెంట్ టీవీ



ప్రపంచంలోనే తొలి వైర్‌లెస్, ట్రాన్సపరెంట్ (పారదర్శక) స్మార్ట్ టీవీ 'ఓఎల్ఈడీ-బీ'ని ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఆవిష్కరించింది. గాజు తెరతో కూడిన ఈ టీవీలోని జీరో కనెక్ట్ బాక్స్ ద్వారా వైర్‌లెస్ విధానంలో ఆడియో, వీడియో ఫైళ్లనూ పంపొచ్చు. ట్రాన్స్‌పరెంట్ మోడ్, బ్లాక్ మోడ్(సాంప్రదాయ పద్ధతి).. రెండు విధాలుగా వీక్షించగలగటం ఈ టీవీ ప్రత్యేకత. ఈ ఏడాదే ఇది గ్లోబల్ మార్కెట్లోకి రానుంది.

1500 మంది ఉద్యోగులపై ఫ్లిప్‌కార్ట్ వేటు?

న్యూఢిల్లీ: ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ 5-7 శాతం మంది ఉద్యోగులను తొలగించే యోచనలో ఉన్నట్లు సమాచారం. దీంతో ఈ ఏడాది మార్చి-ఏప్రిల్ నెలల్లో సుమారు 1,500 మందిపై ఈ ప్రభావం పడబోతున్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం ఈ కంపెనీలో సుమారు 22,000 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరి పనితీరును సమీక్షిస్తున్నట్లు, అదే సమయంలో అంతర్గత పునర్వ్యవస్థీకరణపై కూడా దృష్టి పెట్టినట్లు సమాచారం.

సరగసీని నిషేధించాలి: పోప్

రోమ్: ప్రపంచవ్యాప్తంగా సరగసీ(అద్దె గర్భం) మాతృత్వ విధానాన్ని నిషేధించాలని పోప్ ఫ్రాన్సిస్ పిలుపునిచ్చారు. 'పుట్టబోయే బిడ్డ ప్రాణాలను రక్షించాలి. బిడ్డలను అణిచివేయకూడదు. అక్రమ రవాణా వస్తువుగా మార్చకూడదు. స్త్రీ, పిల్లల గౌరవానికి తీవ్రమైన భంగం కలిగించే సరగసీ మాతృత్వాన్ని నేను జుగుప్సాకరంగా భావిస్తాను' అని రోమ్‌లో తన వార్షిక ప్రసంగంలో పేర్కొన్నారు.

50 ఏండ్ల తర్వాత చంద్రుడిపైకి నాసా ల్యాండర్

న్యూయార్క్: 50 ఏండ్ల తర్వాత చంద్రుడిపై ప్రయోగాలకు అమెరికా సంస్థ 'నాసా' సిద్ధమైంది. అమెరికా అంతరిక్ష పరిశోధనలో మొట్టమొదటి సారిగా ప్రైవేట్ కంపెనీ 'ఆస్ట్రోబోటిక్' చంద్రుడిపైకి ల్యాండర్‌ను పంపింది. సోమవారం ఫ్లోరిడాలోని కేప్ కెనావెరాల్‌లోని స్పేస్‌పోర్ట్ నుంచి 'వుల్కాన్' రాకెట్‌ను ప్రయోగించింది.

ఫ్రాన్స్ పీఎం ఎలీసాబెత్ బోర్నే రాజీనామా

పారిస్: ఫ్రాన్స్ ప్రధానమంత్రి ఎలీసాబెత్ బోర్నే రాజీనామా చేశారు. వివాదాస్పద ఇమిగ్రేషన్ చట్టంపై ఫ్రాన్స్‌లో రాజకీయ ఆందోళనలు తీవ్రమైన నేపథ్యంలో పదవి నుంచి వైదొలిగారు. ఈ చట్టానికి అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్ మద్దతిస్తున్నారు. కొందరు విదేశీయులను దేశం నుంచి పంపించేయడంతో పాటు మరికొన్ని చర్యలు చేపట్టడానికి ప్రభుత్వానికి ఈ చట్టం అధికారం కల్పిస్తున్నది. మాక్రాన్ రెండోసారి ఎన్నికైన తర్వాత 2022 మే నెలలో బోర్నేను పీఎంగా నియమించారు. ఆమె ఆ దేశానికి రెండో మహిళా ప్రధాని. నూతన ప్రభుత్వం ఏర్పాటయ్యే వరకు బోర్నే రోజువారీ కార్యకలాపాలను కొనసాగిస్తారని మాక్రాన్ కార్యాలయం ప్రకటించింది.

16 వేల అడుగుల ఎత్తు నుంచి పడినా..

వాషింగ్టన్, జనవరి 8: అమెరికాలోని పోర్ట్‌ల్యాండ్ నుంచి ఒంటారియో వెళ్తున్న క్రమంలో దాదాపు 16 వేల అడుగుల ఎత్తులో అలస్కా ఎయిర్‌లైన్స్ విమానం డోర్ ఊడిపోయిన ఘటనలో ఆసక్తికర విషయాలు వెల్లడవుతున్నాయి. డోర్ ఊడిపోవడంతో పలు వస్తువులు, ప్రయాణికుల చేతుల్లోని ఫోన్లు విమానం నుంచి కిందపడ్డాయి. అలా కిందపడ్డ ఒక ఐఫోన్‌ను గుర్తించారు. అన్ని వేల అడుగుల ఎత్తు పైనుంచి పడినప్పటికీ ఆ ఫోన్ బాగానే పనిచేస్తున్నదని నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు(ఎన్‌టీఎస్‌బీ) అధికారులు వెల్లడించారు. ఫోన్ ఎయిర్‌ప్లేన్ మోడ్‌లో ఉన్నదని, సగం బ్యాటరీ చార్జ్ ఉన్నదని, బార్నెస్ రోడ్డు పక్కన ఫోన్‌ను గుర్తించిన సీనాథన్ బేట్స్ అనే ఎక్స్ యూజర్ తన పోస్టులో పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సంబంధిత ఫోన్ మాడల్‌పై స్పష్టత లేనప్పటికీ, ఐఫోన్14 ప్రో లేదా ఐఫోన్ 15 ప్రో అని ప్రచారం జరుగుతున్నది.

విండోస్ నుంచి వర్డ్‌ప్యాడ్ ఔట్!

తదుపరి వెర్షన్ల నుంచి తొలగిస్తున్న మైక్రోసాఫ్ట్!

న్యూఢిల్లీ: విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్‌లో సుదీర్ఘ కాలం కొనసాగిన వర్డ్‌ప్యాడ్ సేవల్ని నిలిపివేస్తున్నట్టు మైక్రోసాఫ్ట్ కంపెనీ వర్గాలు తాజాగా వెల్లడించాయి. ఇందుకు సంబంధించిన ప్రణాళికను రూపొందించినట్టు 'విండోస్ ఇన్‌సైడర్ బ్లాగ్' తాజా కథనం పేర్కొన్నది. విండోస్ ఆపరేటింగ్-1995తో మొదలైన వర్డ్‌ప్యాడ్ సేవలు 28 ఏండ్లుగా కొనసాగాయి. దీనికి ప్రత్యామ్నాయంగా మైక్రోసాఫ్ట్ వర్డ్, విండోస్ నోట్‌ప్యాడ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చిన తర్వాత 'వర్డ్‌ప్యాడ్' అవసరం తగ్గింది. దీంతో తదుపరి విండోస్ వెర్షన్ల నుంచి వర్డ్‌ప్యాడ్‌ను పూర్తిగా తొలగిస్తున్నామని, ఇకపై అప్లికేషన్‌ను రీ-ఇన్‌స్టాల్ చేయటం కుదరదని అధికారిక బ్లాగ్ పోస్ట్‌లో మైక్రోసాఫ్ట్ తెలిపింది.

కొలీజియం వ్యవస్థపై విచారణకు బెంచ్:సుప్రీం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు, హైకోర్టుల జడ్జీల నియామకం కోసం అనుసరిస్తున్న కొలీజియం విధానాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణకు ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తామని సీజేఐ డీవై చంద్రచూడ్ సోమవారం చెప్పారు. ఈ పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ జరపాలని లాయర్ మాథ్యూస్ జే నెడుంపర సుప్రీంకోర్టును కోరినపుడు సీజేఐ స్పందిస్తూ, 'ధర్మాసనాన్ని ఏర్పాటు చేయవలసి ఉంది' అన్నారు.

ఆ ప్రొఫెసర్ నుంచి కాపాడండి

లైంగిక వేధింపులపై హర్యానా సీఎంకు 500 మంది విద్యార్థినుల లేఖ

గురుగ్రామ్: ఓ ప్రొఫెసర్ తమపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని హర్యానాకు చెందిన దాదాపు 500 మంది విద్యార్థినులు ఆరోపించడం సంచలనంగా మారింది. ప్రొఫెసర్‌పై చర్యలు తీసుకోవాలని వారు ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తోపాటు గవర్నర్ బండారు దత్తాత్రేయ, మహిళా కమిషన్‌కు లేఖ రాశారు. చౌదరి దేవీలాల్ యూనివర్సిటీలో ఈ ఘటన చోటుచేసుకుంది. చాంబర్‌లోకి పిలిచి ప్రొఫెసర్ తమపై లైంగిక వేధింపులకు పాల్పడేవారని విద్యార్థినులు ఆరోపించారు. వర్సిటీలోని అంతర్గత ఫిర్యాదుల కమిటీకి గతంలో ఫిర్యాదు చేసినప్పటికీ ఆయనకు క్లీనిచిట్ ఇచ్చినట్టు వాపోయారు. విద్యార్థులపై ఆరోపణలపై దర్యాప్తునకు పోలీసులు సిట్ ఏర్పాటుచేశారు.

కర్ణాటకలో ఫీజుల మోత

- యూనివర్సిటీల్లో ఫీజుల పెంపు!
- ఏడాదికి 10% పెంచాలని నిర్ణయం
- రెండేండ్లైతే ఒకేసారి 20-25%
- కాంగ్రెస్ ప్రభుత్వంపై విద్యార్థి సంఘాల ఆగ్రహం
- ఇదే సమయంలోనే 'యువనిధి'కి రిజిస్ట్రేషన్లు
- విద్యార్థుల ఫీజుతో నిరుద్యోగులకు భృతి చెల్లిస్తారా అని నెటిజన్ల ఫైర్



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు చుక్కలు చూపిస్తున్నది. ఏకీకృత ఫీజు విధానం పేరిట రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్టేట్ యూనివర్సిటీల్లో ఫీజుల పెంపునకు సర్కారు సిద్ధమైంది. ఈ మేరకు కర్ణాటక హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ (కేహెచ్ఈసీ) నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆమోద ముద్ర వేసింది. నివేదికలోని ప్రధానాంశాలు అమల్లోకి వస్తే, రాష్ట్రంలోని 32 వర్సిటీల్లో ఏటా 10 శాతం లేదా రెండేండ్లకు ఒకసారి 20-25 శాతం ఫీజుల పెంపు జరుగనున్నది. మరోవైపు, ప్రభుత్వ నిర్ణయంపై విద్యార్థి సంఘాలు భగ్గుమంటున్నాయి. ప్రభుత్వ వర్సిటీల్లో ఫీజులను తగ్గించాల్సింది పోయి పెంచడమేంటని ఆలిండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్‌వో-మైసూరు) నేతలు ప్రశ్నించారు. ఫీజుల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రారంభిస్తూనే.. వాత

ఐదు గ్యారంటీల ప్రచారంతో గత మేలో కర్ణాటక పీఠాన్నెక్కిన కాంగ్రెస్ సర్కారు.. 'యువనిధి' స్కీంను ఏడు నెలల తర్వాత జనవరి 1న ప్రారంభించింది. ఎక్కడాలేని నిబంధనలు పెట్టడంతో గత శుక్రవారంనాటికి 30 వేల దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ప్రభుత్వ హామీ మేరకు డిగ్రీ చదివి నిరుద్యోగులుగా ఉన్నవారికి నెలకు రూ. 3 వేలు, డిప్లొమా వారికి రూ.1,500 చెల్లించాల్సి ఉన్నది. ఇప్పటికే, మిగతా స్కీంల అమలుకు ఆర్థికపరంగా మల్లగుల్లాలు పడుతున్న సర్కారుకు 'యువనిధి' పథకం మరో భారంగా మారింది. ఇదేసమయంలో వర్సిటీల్లో ఫీజులు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించడం దుమారాన్ని రేపుతున్నది. 'ఫీజుల పెంచి విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఆ డబ్బును.. నిరుద్యోగ భృతిగా చెల్లిస్తారా?' అంటూ ప్రభుత్వంపై పలువురు నెటిజన్లు మండిపడుతున్నారు.

మాల్దీవుల రాయబారికి భారత్ సమన్లు

న్యూఢిల్లీ, జనవరి 8: ప్రధాని మోదీపై మాల్దీవుల మంత్రులు చేసిన వ్యాఖ్యల్ని భారత్ సీరియస్‌గా తీసుకుంది. ఆ దేశ డిప్యూటీ మంత్రుల వ్యాఖ్యలపై తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. సోమవారం దీనిపై వివరణ కోరుతూ భారత్‌లో మాల్దీవుల రాయబారి ఇబ్రహీం షాహీద్‌కు సమన్లు జారీచేసింది. 'మాల్దీవుల దౌత్య అధికారి డాక్టర్ అలీ నజీర్ మహ్మద్-భారత హై కమిషనర్ మును మహావార్ ఇరు దేశాల సంబంధాలపై చర్చించారు. వివాదాస్పద వ్యాఖ్యలకు మాల్దీవుల ప్రభుత్వానికి సంబంధం లేదని ఈ సందర్భంగా అలీ నజీర్ స్పష్టం చేశారు' అని భారత విదేశాంగ శాఖ తెలిపింది. కాగా, మాల్దీవులను బాయ్‌కాట్ చేయాలని ఇదివరకే టూరిస్టులు పిలుపునివ్వగా, తాజాగా ట్రేడర్లు కూడా జతకలిశారు.

'ఆ మసీదులను ఖాళీ చేయాల్సిందే'

బెళగావి: కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే కేఎస్ ఈశ్వరప్ప మరోసారి విద్వేషం వెళ్లగక్కారు. ఆలయాల భూముల్లో అక్రమంగా నిర్మించిన మసీదులను ఖాళీ చేయకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆదివారం బెళగావిలో మాట్లాడుతూ.. 'మసీదులు నిర్మించిన మరో రెండు స్థలాలపై దృష్టి సారించాం. అందులో మధుర ఒకటి. కోర్టు నిర్ణయం రాగానే అక్కడ ఆలయ నిర్మాణం కొనసాగిస్తాం' అని ఆయన అన్నారు. 'అలాంటి ప్రదేశాల్లోని మసీదులను ముస్లింలు ఇష్టపూర్వకంగా వదిలేస్తే మంచిది. లేకపోతే తీవ్ర పరిమాణాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది' అని హెచ్చరించారు.

ప్లాస్టిక్‌మయంగా సూపర్ మార్కెట్ల తిండి!

న్యూఢిల్లీ, జనవరి 8: ప్లాస్టిక్ వస్తువుల్లో భద్రపరిచే, వాటిల్లోని ఆహారం తినడం ద్వారా శరీరంలోని సూక్ష్మ రూపంలో ప్లాస్టిక్ రేణువులు చేరుతున్నాయన్న విషయం ఇప్పటికే పలు అధ్యయనాల్లో తేలింది. ఆ ప్లాస్టిక్ అణువుల్లో ఆరోగ్యానికి హాని కలిగించే ప్రమాదకరమైన రసాయనాలు ఉంటున్నాయని కన్జూమర్ రిపోర్ట్స్ అనే సంస్థ తన తాజా అధ్యయనంలో వెల్లడించింది. 85 రకాల ఆహార పదార్థాలను పరీక్షించగా, 84 పదార్థాల్లో ఫాలేట్స్ , 79 శాతం ఆహార నమూనాల్లో బైస్ఫెనాల్-ఏ అనే మరో ప్లాస్టిక్ రసాయనం ఉన్నట్టు తెలిందని తెలిపింది. ఫాలేట్స్, బైస్ఫెనాల్స్‌లు శరీరంలో ఈస్ట్రోజెన్, ఇతర హార్మోన్ల ఉత్పత్తి, నియంత్రణ వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తాయని హెచ్చరించింది.

దక్షిణాదికి నిధులు పెరగాలి

- కేంద్ర ప్రభుత్వం ఎక్కువ వాటా కేటాయించాలి
- మాజీ సీఈఏ సుబ్రహ్మణ్యన్
- 2026 డీలిమిటేషన్ ప్రక్రియతో దక్షిణాది నుంచి కేంద్రానికి సెగ తగలొచ్చని అంచనా
- అందుకే నిధుల పెంపు ముఖ్యమని వెల్లడి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): కేంద్రప్రభుత్వం రాష్ట్రాలకు ఇచ్చే నిధుల్లో దక్షిణాదికి వాటా పెరగాల్సిన అవసరం ఉన్నదని భారత మాజీ ప్రధాన ఆర్థిక సలహాద